కథ

# ఫోన్ బూత్ ప్రహసనం

రచన: జేమ్స్ కోయల్
అనువాదం: డి.పద్మజ

**అమెరికాలో టెలిఫోన్ బూతులు ఎక్కువ. మన దేశంలో పోస్ట్ డబ్బాలకన్నా అధికంగా అవి తారస పడుతుంటాయి.**

అక్కడ టెలిఫోన్ కంపెనీలే టెలిఫోన్ సర్వీస్‌ని నడుపుతుంటాయి తప్ప మన దేశంలా ప్రభుత్వం నడపదు. ప్రయివేటు కంపెనీ అంటే మరి లాభార్జన దృష్టిలో వుంటుంది కదండీ అనే నేపథ్యంలో ఓ అమెరికన్ రచయిత రాసిన హాస్య గల్పిక ఇది.

పబ్లిక్ పే ఫోన్‌ని నేను రోజూ అనేక సార్లు వుపయోగిస్తుంటాను. కాని దాని నిర్మాణానికి దాన్ని నడిపే కంపెనీ తీసుకునే సాంకేతిక శ్రద్ధ గురించి నేనెన్నడూ ఆలోచించనేలేదని చెప్పాలి.

మొన్న నా ఫోన్ కాల్‌ని పబ్లిక్ బూత్‌లోంచి ముగించాక చూస్తే ఓ వ్యక్తి ఆ బూత్ బయట టేప్‌తో దాని కొలతలు తీసుకోవడం గమనించాను. అతను పైప్ తాగుతున్నాడు కాబట్టి ఇంజనీర్ అని షెర్లాక్ హోమ్స్‌లా పట్టేసాను.

"మీ కంపెనీ అభివృద్ధి కార్యక్రమాలని చేపడుతుందా?" అడిగాను.

అతను తలవూపాడు. తన టేప్‌ని టైలా మెడచుట్టూ వేసుకుని జేబులోంచి చిన్న నోట్ బుక్ తీసి అందులో ఏదో రాసుకుని చెప్పాడు నాతో.

"ఇది చాలా పెద్ద ఫోన్ బూత్".

"చాలా పెద్దదా?" అడిగాను ఆశ్చర్యంగా.

"అవును ఓ మనిషి సౌకర్యంగా కూర్చుని ఫోన్‌ని వుపయోగించవచ్చు. ఫోన్‌లో వింటూ రాసుకోడానికి వీలుగా ఓ షెల్ఫ్ కూడా వుంది. అంతే కాదు పైన లైటు పని చేస్తోంది".

"అది తప్పా?" అడిగాను.

మళ్ళీ తల వూపాడు.

"ఫోన్ బూత్‌ని సౌకర్యంగా చేస్తే కొందరు ఎక్కువ సేపు మాట్లాడేస్తుంటారు" చెప్పాడు.

"అర్థమైంది. ఎక్కువ ఫోన్ కాల్స్ చేస్తేనే ఎక్కువ లాభాలు మీ కంపెనీకి వస్తాయి కదా?" అడిగాను.

"అవును. ఇంకోటి దీని సీలింగ్ బాగా ఎత్తుగా వుంది".

దానివంక చూసి చెప్పాడు.

"ఆ మాత్రం అయినా వుండాలి కదా?"

●●●

**అతను పైప్ తాగుతున్నాడు. కాబట్టి ఇంజనీర్ అని షెర్లాక్ హోమ్స్‌లా పట్టేశాను.**

●●●

"అక్కడే వస్తుంది తేడా. సీలింగ్‌ని ఆరంగుళాలు తగ్గిస్తే ఫోన్‌ని వుపయోగించేవారు మోకాళ్ళ మీద వంగి నించోవాల్సి వస్తుంది. అందువల్ల వాళ్ళు ఇప్పుడు మాట్లాడే టైంలో సగం టైమ్ తీసుకుంటాడు."

"దాంతో ఫోన్ కాల్స్ సంఖ్య పెరుగుతుంది. అవునా?" అడిగాను నేను.

"ఫోన్ బూత్ నిర్మాణం ఒకకళ. ఇట్సెన్ ఆర్ట్" పైప్‌లోంచి బూడిదని రాల్చి అడిగాడు నన్ను.

"ఈ బూత్‌లో లోపం ఎక్కడుందో తెలుసా?"

"లొకేషన్".

ట్రాఫిక్ శబ్దాలు వినపడకుండా ఇది సైడ్ స్ట్రీట్‌లో ఓ మూలగా వుంది.

"అదే పాయింట్. చాల నిశ్శబ్దంగా వుండే చోట వుంది. దీన్నే ట్రాఫిక్ చప్పుడు వినబడే బిజీ స్ట్రీట్‌లో వుంచితే లేదా రాక్ అండ్ రోల్ గట్టిగా వినబడే డ్రగ్ స్టోర్‌లో వుంచితే మాట్లాడాల్సిన టైం కన్నా ఎవరూ ఎక్కువ సేపు అనవసరంగా ఒక్క మాటకూడా మాట్లాడరు.

"ఈ విషయాలన్నీ మీ ఫోన్ కంపెనీలో ఎవరు ఆలోచిస్తూ వుంటారు?" అతని వంక ఆరాధనగా చూస్తూ అడిగాను.

"అసౌకర్య పథక కమిటీ. ఈ బూత్‌కి ప్రత్యేకమయిన గ్లాస్‌ని సీలింగ్‌లో పెట్టాలనుకుంటున్నాం".

"ప్రత్యేకమయిన గ్లాసా?" అడిగాను.

"అవును. అది వేసవిలో వేడిని చలికాలంలో చలిని పీల్చుకుని బూత్‌లోకి వదులుతుంటుంది.

"మరి తలుపుల మాట?" అడిగాను.

ఇన్‌స్టన్‌లా గంభీరంగా మందహాసం వేసి చెప్పాడు.

"తలుపులా? అసౌకర్యపథక కమిటీలోని ఓ మేధావి అసలు తలుపులుండకూడదని ప్రపోజ్ చేసాడు. అందువల్ల శబ్దం, వాతావరణ ప్రభావం బూత్‌లో బాగా పడుతుంది. తలుపు ఖర్చు తగ్గుతుంది."

"అందువల్ల ఫోన్ కాల్ టైమ్ తగ్గుతుంది"

"అవును".

"కాని తలుపులు లేకుండా వుంటే వర్షంలో ఎలా? జల్లు లోపలికి పడదు?"

"ఇంజనీరింగ్ మాస్టర్ పీస్ ఐడియా అదే. వర్షంలో ఫోన్ కాల్‌ని మామూలు టైమ్‌కన్నా పదో వంతు సమయం తగ్గుతుంది. అలాగే కొత్త మోడల్ బూత్‌లో రాసుకోవడానికి షెల్ఫ్ కూడా వుండదు.

"అది సరే. ముందు బాక్స్‌లో పదిసెంట్ల నాణెం వేసి డయల్ చేస్తాను. అవతలి వైపు ఫోన్ ఎత్తి మాట్లాడితే ఆ కాయిన్ ఇక తిరిగి రాదు. కాని ఎంగేజ్డ్ వచ్చినా, ఎవరు ఎత్తకపోయినా రిసీవర్ పెట్టేస్తే నాణెం తిరిగి బయటకి రావాలి కాని కొన్ని ఫోన్ బూత్‌లలో అలా అవి తిరిగి రావడం లేదే?" చాలా కాలంగా వున్న సందేహం తీర్చుకుందామని అడిగాను.

"ఎందుకంటే ఇంకా ఈ ఏరియాలో కొన్ని పాతమోడల్ ఫోన్స్ వున్నాయి. కొత్త మోడల్స్ లోంచి కాల్ మెటీరియలైజ్ అయినా అవకపోయినా కూడా కాయిన్స్ బయటికి రావు. ఫోన్ కాల్ కలవనప్పుడు నాణాలు అలా బయటికి వచ్చే ఏర్పాటు చేయడం పెద్ద తప్పని అసౌకర్య పథక కమిటీ భావిస్తోంది.

చేతి గడియారం వంక చూసుకుని చెప్పాను.

"ఓ.కే టైమయింది. నే వెళ్ళాలి. థాంక్స్"



ఆ ఇంజనీరు చిన్నగా దగ్గి చెప్పాడు.

"మీ దగ్గర ఓ పదిసెంట్లు బిళ్ళ వుంటే ఇస్తారా? మా కంపెనీ ఆఫీసుకి ఫోన్ చేయాలి. ఇందాక ఫోన్ చేస్తే లైన్ బిజీగా వుంది.

"అది మీ దగ్గర వున్న ఆఖరి నాణెం. ఈ ఫోన్ బూత్‌లోని ఫోన్ బాక్స్ ఆ నాణాన్ని తిరిగి ఇవ్వలేదు. అవునా?" అడిగాను.

"మీకెలా తెలుసు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"నిన్నటి దాకా వున్న పాతమోడల్ కాదిది. కొత్త మోడల్ ఫోన్. ఫోన్ కంపెనీలో పనిచేస్తున్నప్పుడు అది లాభాలు గడించే ప్రయత్నం చేయాల్సిన బాధ్యత మీ మీద ఉంది. కాని నా మీద కాదుగా? నేనివ్వనంటే ఇవ్వను" చెప్పి నా కారు వైపు నడిచాను.

●

## నాలుగు భాషల సమ్మేళనం

తెలుగులో ఇటీవల ప్రారంభమైన విజయదుర్గ ప్రొడక్షన్స్ చిత్రంలో నాలుగు భాషల నటీనటులు కలిసి నటిస్తుండడం విశేషం. ఇందులో సుమన్, మమ్ముట్టి, నగ్మా, శోభన, మాలాశ్రీ నటిస్తున్నారు. సుమన్ తెలుగు నటుడు కాగా మమ్ముట్టి మళయాళీ అయినప్పటికీ తెలుగు, హిందీ, తమిళ, మళయాళ భాషల్లో నటిస్తున్నారు. నగ్మా హిందీ నటి అయినప్పటికీ తెలుగులో కూడా నటిస్తోంది. మాలాశ్రీ కన్నడంలో నెంబర్‌వన్ నాయిక తెలుగులో కూడా నటిస్తోంది. శోభన తమిళ, తెలుగులో నటిస్తోంది. ఇలా అన్ని భాషల నటీనటులతో నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని 'అంకురం' చిత్రంతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన యువదర్శకుడు సి.ఉమామహేశ్వరరావు దర్శకత్వం వహిస్తున్నారు.

— నారాయణరాజు.



